క్లుప్తంగా

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రం లోని లబ్ధిదారులకు మంగళవారం సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్ కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మర్కంటి లక్ష్మీ మల్లేశ్, నాయకులు రజనీకాంత్, రమేష్, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

కాంటిజెన్ వర్కర్ తొలగింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కమ్మర్‌పల్లి: స్థానిక పీహెచ్‌సీలో కాంటిజెన్ వర్కర్‌గా పని చేస్తున్న డంగర్ గాయత్రి అనే మహిళను విధుల నుంచి తొలగించడంపై జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సలీం ఉద్దేశపూర్వకంగా అక్రమ తీర్మానంతో ఎస్సీ మహిళను తొలగించి, ఆ స్థానంలో ముస్లిం మహిళను నియమించారని కలెక్టర్‌కు విన్నవించారు. అక్రమ తీర్మానాన్ని రద్దు చేసి గాయత్రికి న్యాయం చేయాలని కోరారు.

కేజీబీవీ ఉద్యోగులకు వేసవి సెలవులు ఇవ్వాలి

ఆర్మూర్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేసవి సెలవులు ఇవ్వాలని డీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలయ్య, రాజన్నలు డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వకుండా ప్రతిరోజు పాఠశాలకు వెళ్లాలని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు అధికారి ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు. విద్యార్థులు లేనప్పటికీ వేసవిలో కూడా ఉపాధ్యాయులు ప్రతిరోజు పాఠశాలకు హాజరుకావాలని హుకుమ్ జారీ చేయడం విరమించుకోవాలని కోరారు.

గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో పునర్నిర్మిస్తున్న లక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయంలో మంగళవారం గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ కార్యక్రమానికి కేదారీశ్వర్య ఆశ్రమ వ్యవస్థాపకుడు బాలయోగి రాములు మహరాజ్ ముఖ్య అతిథిగా హాజరై గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

ఆర్మూర్‌టౌన్: పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు డాక్టర్లు స్రవంతి, అయేషాలు వైద్య పరీక్షలు నిర్వహించారు. 132 మంది మహిళలను పరీక్షించి 17 మంది రక్త నమూనాల సేకరించారు. సమస్య ఉన్న వారికి ఉచితంగా మందులిచ్చారు. ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖర్ ఉన్నారు.

శోభాయాత్ర

రెంజల్(బోధన్): కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలోని సీతారాం ధాం సంత్ సేవాశ్రమంలో పంచకుండాత్మక శ్రీరామ మహాయజ్ఞం, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం విగ్రహమూర్తులతో శోభాయాత్ర నిర్వహించారు.


డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి

బాల్కొండ: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఐకేపీ వీవోఏలు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీకి బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల నుంచి వీవోఏలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో వీవోఏ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు అరుణ పాల్గొన్నారు.

పుట్టిన పిల్లలకు టీకాలు వేయించండి

ఆర్మూర్‌టౌన్ : గర్భిణులకు, పుట్టిన పిల్లలకు ఖచ్చితంగా టీకాలు ఇవ్వాలని జిల్లా వ్యాధి నిరోధక టీ కాల అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఆరోగ్యశాఖ ఆర్మూర్ డివిజన్ వైద్యాధికారులు, సూపర్‌వైజర్స్ , ఏఎన్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్, జిల్లా డాటా మేనేజర్ నారాయణ, సురేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ సాధించిన ఉపాధ్యాయుడికి సన్మానం



నిజామాబాద్ అర్బన్ : రుద్రూర్ ఆదర్శ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బట్టు శ్రీనివాస్ రాజుకు డాక్టరేట్ లభించింది. ఈసందర్భంగా మంగళవారం శ్రీనివాస్‌రాజును ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తన కార్యాలయంలో సన్మానించారు.

నిధులు మంజూరైనా..

- మారంపల్లి–నూత్‌పల్లి బైపాస్ రోడ్డుకు లభించని మోక్షం
- అడుగడుగునా గుంతలతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



కంకర తేలి అధ్వానంగా మారిన మారంపలి–నూత్‌పల్లి బైపాస్ రోడ్డు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల పరిధిలోని మారంపల్లి–నూత్‌పల్లి బైపాస్ రోడ్డు అధ్వానంగా తయారైంది. బీటీ రోడ్డు కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. దారిపొడవునా ఇదే పరిస్థితి ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజల రాకపోకలకు కష్టంగా మారింది. మారంపల్లి గ్రామం దాటిన తర్వాత ఎడమవైపు నుంచి పొలాల మధ్య నుంచి బైపాస్ రోడ్డు తీశారు. ఇది నూత్‌పల్లి వరకు వెళ్తుంది. దాదాపు నాలుగు కిలోమీటర్ల ఉండగా, ఐదేళ్ల క్రితం బీటీ రోడ్డు వేశారు. ట్రాక్టర్ల కేజీ వీల్స్ కారణంగా రోడ్డంతా దెబ్బతింది. మరమ్మతులు చేయడానికి కూడా వీలు లేకుండా మారింది. దీంతో రాత్రుల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

ముందుకు రాని కాంట్రాక్టర్..

బీటీ రోడ్డు పూర్తిగా చెడిపోవడంతో దీనిపై మళ్లీ కొత్త రోడ్డు వేయడానికి పంచాయతీరాజ్ శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. రూ.1.08 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఇటీవల టెండరు పూర్తయింది. కానీ, ఇంత వరకు ఆ కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. వేరే రోడ్లకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతోనే కాంట్రాక్టర్ మారంపల్లి–నూత్‌పల్లి బైపాస్ రోడ్డు పనులు ప్రారంభించడం లేదని తెలుస్తోంది.

రోడ్డు త్వరగా వేయాలి

బైపాస్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. కంకర తేలడంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ప్రమాదాలు జరగకముందే అధికారులు రోడ్డును త్వరగా వేయాలి.

– కృష్ణాగౌడ్, మారంపల్లి

టెండరు పూర్తయింది

రోడ్డు పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. ఇటీవల టెండరును పూర్తి చేసుకున్నాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– బాలాజీ, ఏఈ, పంచాయతీరాజ్

అధికారులతో మాట్లాడుతున్నాం

రోడ్డు పనులు మొదలుకాకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్నాం. ఎదురవుతున్న సమస్యలను అధిగమించి వీలైనంత త్వరగా రోడ్డు వేయాలని కోరాం.

– అర్గుల రవి, ఉప సర్పంచ్, మారంపల్లి

ఎమ్మెల్యే చిత్తశుద్ధి నిరూపించుకోవాలి



మొలకలు వచ్చిన ధాన్యంతో రెంజల్ తహసీల్ వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

- ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలి
- బీజేపీ ఆధ్వర్యంలో రెంజల్‌లో రైతులతో ధర్నా, రాస్తారోకో

రెంజల్(బోధన్): అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుని నియోజకవర్గ ఎమ్మెల్యే షకీల్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో ప్రభుత్వంతో పనిలేకుండా తాను ప్రతీ గింజను కొనుగోలు చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే మాటకు కట్టుబడి ఉండాలని కోరారు. అకాల వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రెంజల్ తహసీల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. వర్షాలకు మొలకలు వచ్చిన ధాన్యం తీసుకొచ్చి ముందుగా ధర్నా నిర్వహించారు. అనంతరం కందకుర్తి–నవీపేట్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డీ మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ.. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఇస్తారో లేదా ప్రభుత్వంతో ఇప్పిస్తారో స్పష్టం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే రైతులు నష్టపోవాల్సి వచ్చిందని, ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. అకాల వర్షాలకు తడిసి, మొలకలు వచ్చిన ధాన్యాన్ని షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలన్నారు. తడిసిన ధాన్యాన్ని తానే కొనుగోలు చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే షకీల్ ముందుగా రైతులకు డబ్బులు చెల్లించి ధాన్యాన్ని తన రైస్‌మిల్లులకు కొనుగోలు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ రజని, జెడ్పీటీసీ విజయ, చుక్క రాజుగౌడ్ పాల్గొన్నారు.

పాలకవర్గం లేకనే జాప్యం



ఆర్మూర్‌టౌన్: మార్కెట్ యార్డు పాలకవర్గం లేకపోవడంతో వరిధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి ఆరోపించారురు. కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిరసనగా మార్కెట్ యార్డు అధికారికి వినతి అందజేశారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. 15 రోజుల నుంచి రైతులు వరి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తూ అకాల వర్షానికి వడ్లు తడిసి నష్టపోతుంటే బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, 10 కిలోల వరకు తరుగు తీస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని వెంటనే నియమించి రైతుల కష్టాలు తీర్చాలని వారు కోరారు.

ప్రజల కోసమే ఆర్టీసీ బస్సులు



నందిపేట(ఆర్మూర్): ఆర్టీసీ ప్రజల కోసమే బస్సులు నడుపుతోందని, ఆర్టీసీ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని ఆర్మూర్ డిపో మేనేజర్ కవిత పేర్కొన్నారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ నూతనంగా ప్రవేశపెట్టిన ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని మంగళవారం కుద్వాన్‌పూర్‌లో నిర్వహించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు బస్ పాస్ రాయితీలు, దివ్యాంగులకు 50 శాతం రాయితీ ఇస్తున్నామని వివరించారు. 20 రోజుల చార్జీలు చెల్లించి 30 రోజులు ప్రయాణించే విధంగా బస్ పాస్ అందుబాటులో ఉందని తెలిపారు. ఆర్టీసీ అందిస్తున్న వివిధ సేవల గురించి చెప్పారు. గ్రామ సర్పంచ్ చిన్న సాయన్న, ఉప సర్పంచ్ సాగర్, ఎంపీటీసీ గోదావరి పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి



నవీపేటలో సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నేతలు

నవీపేట: జేపీఎస్‌ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ బోధన్ నియోజకవర్గ నేతలు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. నవీపేటలో జేపీఎస్‌ల దీక్షా శిబిరంలో వారు పాల్గొని సంఘీభావం తెలిపారు.

ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలి

బాల్కొండ: జేపీఎస్‌లను రెగ్యులర్ చేసేలా ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని కోరుతూ ముప్కాల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

సీపీఎం మద్దతు

వర్ని: జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. వర్ని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్యదర్శుల సమ్మె శిబిరానికి వెళ్లి తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు.

కోటగిరిలో కాంగ్రెస్ నేతల మద్దతు

రుద్రూర్/రెంజల్: కోటగిరిలో జేపీఎస్‌ల సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ నేత కాసుల బాలరాజ్ సందర్శించి మద్దతు ప్రకటించారు. గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర ఎంతో ముఖ్యమని, ప్రభుత్వం వారి డిమాండ్లను నెరవేర్చడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. రెంజల్‌లో జేపీఎస్‌లు సమ్మె కొనసాగిస్తున్నారు.



భీంగల్: కేసీఆర్ తాతా మా అమ్మను రెగ్యులర్ చేయండి అంటూ ప్లకార్డు పట్టుకున్న బాలుడు

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



మాక్లూర్: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అడవి మామిడిపల్లి రైతులు తడిసిన ధాన్యం బస్తాలతో 63 నంబర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. అకాల వర్షానికి వరి ధాన్యం రాత్రికి తడవటం ఉదయం ఆరబెట్టటమే పనిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కాంటాలు చేయలేమంటూ నిర్వాహకులు కొనుగోలు కేంద్రాలను నిలిపివేశారని మండిపడ్డారు. కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు రోడ్డుపైనే బైఠాయిస్తామని కూర్చున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు చెప్పినా వినలేదు. చివరికి తహసీల్దార్ శంకర్ చేరుకొని హామీ ఇవ్వటంతో రైతులు ఆందోళన విరమించుకున్నారు.

కారోబార్ల సమ్మె నోటీసు



ముప్కాల్‌లో సమ్మె నోటీస్ అందజేస్తున్న కారోబార్లు

తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ కారోబార్లు మంగళవారం జిల్లా వ్యాప్తంగా సమ్మె నోటీసులు అందజేశారు. ఈ నెల 5 నుంచి నిరవధికంగా సమ్మెను కొనసాగిస్తామని తెలుపుతూ స్థానిక ఎంపీడీవోలకు, ఎంపీవోలకు సమ్మె నోటీసులు ఇచ్చారు. కారోబార్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పంచాయతీ కార్యదర్శి, అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రత్యేక కల్పించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్

రైతుల అభ్యున్నతి కోసమే పథకాలు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్ రెడ్డి

రుద్రూర్: తెలంగాణ ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసమే పలు పథకాలు అమలు చేస్తోందని డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. చందూర్ మండలం మేడిపల్లిలో మంగళవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. లక్ష్మాపూర్‌లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సింగిల్ విండో సబ్‌సెంటర్‌కు భూమిపూజ చేశారు. అనంతరం 10 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి పండించిన పంటలను తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని రైతులను కోరారు. సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తున్నామని అన్నారు. విండో చైర్మన్ ప్యారం అశోక్, సర్పంచ్‌లు సత్యనారాయణ, కర్లం సాయరెడ్డి, రవి, దేవిసింగ్, ఏఎంసీ చైర్మన్ కవిత పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడతాం



మాట్లాడుతున్న సీఐటీయూ నేత రమేశ్ బాబు

బోధన్:కార్మికుల హక్కుల కోసం పోరాడతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌బాబు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. సుప్రీం కోర్టు తీర్పునసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లను పర్మినెంట్ చేయాలని, మే నెలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు 15 రోజుల పాటు వేసవి సెలవులు ఇవ్వాలని పేర్కొన్నారు.

హక్కులను కాలరాస్తున్న పాలకులు

బోధన్: కార్మికులు ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను పాలకులు కాలరాస్తున్నారని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్ అన్నారు. మేడే ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ శివారులోని నర్సాపూర్‌లో సుత్తి కొడవలి గుర్తు ఉన్న ఎర్రజెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను పాలకులు కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగిస్తున్నారన్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన



మోస్రాలో పంటలను పరిశీలిస్తున్న భాస్కర్ రెడ్డి



నాళేశ్వర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

రుద్రూర్: మోస్రా మండల శివారులో అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పొలాలను డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి మంగళవారం మండల అధికారులతో కలిసి పరిశీలించారు. మండల పరిధిలో 150 ఎకరాల వరకు పంట నష్టం వాటిల్లినట్లు స్థానిక రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10 వేలు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లిస్తుందని రైతులకు భరోసానిచ్చారు. కాంటా చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు.

నష్ట పరిహారం త్వరగా చెల్లించాలి

రుద్రూర్: అకాల వర్షం, వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలని బాన్సువాడ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. కోటగిరి మండలంలో మంగళవారం పార్టీ నాయకులతో కల్సి పర్యటించి దెబ్బతిన్న పంటలు పరిశీలించారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి వెళ్లి మొలకలు వచ్చిన వరి ధాన్యాన్ని చూపించారు. డీసీసీ కార్యదర్శి కొట్టం మనోహర్, మాజీ ఎంపీపీలు పుప్పాల శంకర్, గంగాధర్ దేశాయ్, గోవింద్ రావ్, అయ్యుబ్, హైమద్ తదితరులున్నారు.

ఆర్మూర్ మండలం చేపూర్‌లో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌లో అకాల వర్షాలకు నష్టపోయిన పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి హరికృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ..ఆరబోసిన వరి ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచాలని సూచించారు. సర్పంచ్ ఇందూర్ సాయన్న పాల్గొన్నారు.

నవీపేటలో అదనపు కలెక్టర్ పరిశీలన

నవీపేట: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని నాళేశ్వర్, నిజాంపూర్, బినోల గ్రామాల శివార్లలోని పంట పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను వెంటనే తరలించే ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



కోటగిరిలో పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత బాల్‌రాజ్



చేపూర్‌లో పరిశీలిస్తున్న ఏవో హరికృష్ణ

తల్లడిల్లుతున్న రైతులు

అకాల వర్షానికి రైతు అతలాకుతలాం అవుతున్నాడు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిచి మొలకలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులుగా రాత్రి సమయంలో అకస్మాత్తుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు ధాన్యం కుప్పల వద్ద కాపలా కాస్తున్నారు. వడ్ల చుట్టూ చేరిన నీటిని తోడే పనిలో నిమ్మగ్నమవుతున్నారు. కొనుగోలు కేంద్రాలలో అమ్ముదామంటే రైస్ మిల్లర్లు తరుగు అడుగుతున్నారు. తడిచిన ధాన్యాన్ని కొనడానికి మిల్లర్లు కొనడానికి జంకుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్



మాక్లూర్: ధాన్యపు రాశుల చుట్టూ చేరిన నీటిని తొలగిస్తున్న రైతులు



ఆర్మూర్‌టౌన్: తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు



రెంజల్: వడ్ల వద్ద నీటిని తొలగిస్తున్న రైతు



నందిపేట: తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

సంక్షిప్తం

న్యాయమూర్తి అపర్ణకు వీడ్కోలు

బోధన్: బోధన్ కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపర్ణను హైదరాబాద్‌లోని మహేశ్వరం కోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళవారం స్థానిక కోర్టులో జడ్జి అపర్ణకు వీడ్కోలు సమావేశం, సన్మానం నిర్వహించారు. ఐదవ జిల్లా అదనపు న్యాయమూర్తి రవికుమార్, సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పసుపు అధిక దిగుబడి సాధించిన రైతుకు సన్మానం

కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌లో పసుపు సాగు చేసి అధిక దిగుబడి సాధించిన యాల్ల నవీన్ అనే రైతును వ్యవసాయ శాఖ అధికారులు, యువమిత్ర యూత్ సభ్యులు కలిసి సన్మానించారు. ఒకటిన్నర ఎకరంలో 85 క్వింటాళ్ల దిగుబడి సాధించిన నవీన్‌ను స్థానిక రైతు వేదిక భవనంలో మంగళవారం సన్మానించారు. ఏఈఓ రమేష్, నాయకులు చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టకుండా తీర్మానం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రిలో రోడ్లపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టకుండా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం తీర్మానం చేశారు. వీడీసీ నిర్ణయంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పాయని తెలిపారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో మంగళవారం సర్పంచ్ ఇందూర్ సాయన్న కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఉప సర్పంచ్ నడ్కుడ శ్రీనివాస్, ఎంపీటీసీ బాల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెల్కటూర్‌లో..

బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సామ గంగారెడ్డి ప్రారంభించారు. ఉపసర్పంచ్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

శిబిరాన్ని పరిశీలించిన జెడ్పీ చైర్మన్

ఎడపల్లి(బోధన్): జానకంపేటలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు పరిశీలించారు. సింగిల్ విండో చైర్మన్ మిద్దె నరేందర్, ఎంపీడీవో గోపాలకృష్ణ, నవీపేట్ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలు..

మాక్లూర్: అడవి మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలను మంగళవారం సర్పంచ్ చింత మల్లారెడ్డి ప్రారంభించారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఆనవాయితిలో భాగంగానే ఈ సంవత్సరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి ముత్తెన్న, బాల్ బ్యాడ్మింటన్ కోచ్ భూపతి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సంబరాలు

కమ్మర్‌పల్లి: మేడే కానుకగా సీఎం కేసీఆర్ పారిశుధ్య కార్మికులకు రూ.1000 వేతనం పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం చౌట్‌పల్లి, బషీరాబాద్ గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు సంబరాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవితతో కూడిన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

నృత్య నికేతన్ విద్యార్థులకు ఎంటీఏ ఆహ్వానం

ఆర్మూర్: ఆర్మూర్‌కు చెందిన నటరాజ నృత్య నికేతన్ విద్యార్థులకు మలేషియా తెలుగు అసోసియేషన్(ఎంటీఏ) నుంచి ఆహ్వానం అందినట్లు నృత్య గురువు బాశెట్టి మృణాళిని తెలిపారు. ఎంటీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియన్ డాన్స్ ఫెస్టివల్‌లో పాల్గొనే అరుదైన అవకాశం నృత్యానికేతన్ విద్యార్థులకు లభించిందన్నారు.